
సాక్షి
ఒడిశా
గురువారం । 6 । జూలై । 2023


శ్రీమందిరం ఆదాయం లెక్కింపు
భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలక వర్గం బుధవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,37,674లు, బంగారం 2.66 గ్రాములు, వెండి 17.4 గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.


విచారణకు ఓకే..
- 8లో.


జోరుగా ఆక్రమణల తొలగింపు
- 8లో.

న్యూస్‌రీల్

3కింటాళ్ల గంజాయి స్వాధీనం



బల్లిగుడా పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

బరంపురం: కొందమాల్ జిల్లా బల్లిగుడా నుంచి అక్రమంగా రవాణా అవుతున్న గంజాయిని పోలీసులు సీజ్ చేశారు. ఎస్‌డీపీఓ తపన్‌కుమార్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం బల్లిగుడా పరిధి కామన్‌కుల అటవీ ప్రాంతంలో గంజాయి తరలింపుపై అందిన సమాచారం మేరకు పోలీసులు దాడులు చేపట్టారు. పోలీసుల రాకను ముందే పసిగట్టిన నిందితులు.. ట్రక్కును వదిలి, సమీపంలోని అడవిలోకి పరారయ్యారు. వాహనాన్ని తనిఖీ చేయగా, 3కింటాళ్ల గంజాయి పట్టుబడింది. సరుకు, ట్రక్కును సీజ్ చేసి, ఘటనపై కేసు నమోదు చేశారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.15 లక్షలు ఉంటుందని, నిందితుల కోసం గాలిస్తున్నామని ఎస్‌డీపీఓ తెలిపారు.

గుర్తింపు లేదు!

- నిరీక్షణలో 52మంది మృతదేహాలు



భువనేశ్వర్: బాలాసోర్ జిల్లా బహనాగా బజార్ ట్రిపుల్ రైలు ప్రమాదం జరిగి నెల రోజులు దాటినా 50కి పైగా మృతదేహాల గుర్తింపు ఇప్పటికీ ఊగిసలాడుతోంది. భువనేశ్వర్ అఖిల భారత వైద్య విజ్ఞానసంస్థ(ఎయిమ్స్)లో ప్రత్యేక కంటైనర్లలో ఈ మృతదేహాలను భద్రపరిచారు. అయితే ఎవరూ వీటిని తీసుకు వెళ్లకపోవడంతో గుర్తింపు కోసం నిరీక్షిస్తున్నారు. ఎయిమ్స్‌లో 81 మృతదేహాలను భద్రరచగా, డీఎన్‌ఏ పరీక్ష ద్వారా 29 మృతదేహాలను నిర్ధారించారు. వీటిలో 22 అప్పగింత ప్రక్రియ పూర్తి చేశారు. జార్ఖండ్‌కు చెందిన దినేష్ యాదవ్(31), బీహార్‌కు చెందిన సురేష్ రే(23) బంధువర్గం తమ వారి దేహాలను స్వస్థలాలకు తరలించి, అంత్యక్రియలు నిర్వహించడం సాధ్యం కాదని అభ్యర్థించడంతో స్థానిక సత్యనగర్ శ్మశానవాటికలో దహనం చేశారు. భువనేశ్వర్ నగరపాలక సంస్థ(బీఎంసీ) ఉచితంగా వీటికి అవసరమైన ఏర్పాట్లు చేసింది. ప్రస్తుతం ఎయిమ్స్‌లో రైలు ప్రమాద బాధితుల్లో 52 మృతదేహాలను కంటైనర్లలో వైజ్ఞానిక ప్రణాళికలో భద్రంగా ఉంచారు. అతి త్వరలో వీటి డీఎన్‌ఏ పరీక్షల నివేదిక అందుతుందని అధికార వర్గాల సమాచారం. ఇదిలా ఉండగా.. ఈ విషాద ఘటనలో ఇప్పటి వరకు 293మంది ప్రాణాలు కోల్పోగా.. మరి కొంతమంది వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

ఉధృతంగా పంచాలి నది

- రెండు గ్రామాలకు నిలిచిపోయిన రాకపోకలు


శంకరడ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న పంచాలి నది

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి శంకరడ పంచాయతీ పరిధిలో గత 2రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంచాలి నది ఉగ్ర రూపం దాల్చింది. దీంతో నది అవతలి వైపు ఉన్న కెబిడి, కొపాడంగ్ గ్రామాల నుంచి బాహ్య ప్రపంచంతో రాకపోకలు నిలిచిపోయాయి. నదిపై ఉన్న వంతెన మీదుగా వరదనీరు ప్రవహించడంతో రెండు గ్రామాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఇంత వరకు అధికారులు ఎవరూ ఈ గ్రామాలకు చేరుకోలేదు. నిత్యావసరాల కోసం గ్రామస్తులు అవస్థలు పడుతున్నట్లు సమాచారం. కాగా బుధవారం సాయంత్రం నుంచి కురుస్తున్న ఏకధాటి వర్షానికి నీటి ప్రవాహం మరింత ఉధృతమయ్యింది. నదీ సమీపంలోని గ్రామస్తులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు. నదీ ప్రవాహం వల్ల వరదనీరు ఎప్పుడు గ్రామంలోకి చేరుతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆదర్శం..


రక్తదానం చేస్తున్న రాజీవ్‌లోచన్ దంపతులు

వివాహ వార్శికోత్సవం నేపథ్యంలో రక్తదానం చేసిన ఓ జంట పలువురికి ఆదర్శంగా నిలిచారు. రాయగడ పట్టణంలోని రాణిగుడ ఫారంలో నివాసముంటున్న రాజీవ్‌లోచన్ పండా, ఆయన భార్య రాఖీ పండా తమ 20వ వివాహ వార్శికోత్సవాన్ని పురష్కరించుకుని తమ ఇంటి వద్ద రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. తాము స్వయంగా రక్తదానం చేయడంతో పాటు బంధుమిత్రుల సహకారంతో 25 యూనిట్ల రక్తం సేకరించారు. అనంతరం వీధుల్లో మొక్కలు నాటి, పేదలకు సోలార్ ఫలకాలు, మిఠాయిలు పంచిపెట్టారు. డీపీఆర్‌ఓ బసంతకుమార్ ప్రధాన్, సరోజ్‌కుమార్ ఆచార్య, ఉమాశంకర్ మిశ్రా, జిల్లా కేంద్రాస్పత్రి బ్లడ్ బ్యాంక్ అధికారి గౌతమ్ పట్నాయక్, ఈ సందర్భంగా వారిని అభినందించారు. – రాయగడ

ఆందోళన..

ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో పేదలకు ఇళ్ల మంజూరులో సమితి అధికారులు పక్షపాత వైఖరి ప్రదర్శిస్తున్నారని కాశీనగర్ పంచాయతీ ప్రజలు వాపోయారు. ఈ మేరకు పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. అమృత్ సరోవర్ పథకంలో భాగంగా చెరువుల పుణరుద్ధరణ పనులు ఉపాధి వేతనదారులతో కాకుండా యంత్రాలతో చేయించడంతో ఉపాధి కోల్పోతున్నారని మాజీ సర్పంచ్ దారపు రాజేష్‌కుమార్(చిట్టి) ఆరోపించారు. దీనిపై విచారణ చేపట్టాలని బీడీఓ కపిలేశ్వర తండికి వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఆయన.. ఈనెల 15లోగా అర్హులైన వారికి ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. నాయకులు నెట్టిని కోటేశ్వరరావు, సర్పంచ్‌లు శంకరరావు, పిన్నింటి కిరణ్ పాల్గొన్నారు. – పర్లాకిమిడి


పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న గ్రామస్తులు

ఆవేదన..


కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించిన బాధితులు

రాయగడ పట్టణ శివారు రాణిగుడఫారం, నాగావళి నదీ పరీవాహక ప్రాంతంలో రక్షణ గోడలు నిర్మించి, తమను ఆదుకోవాలని పరిసర ప్రాంతాల ప్రజలు కోరారు. ఈ మేరకు కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్‌ను కలిసి, వినితిపత్రం అందించారు. ఏటా వర్షాకాలంలో నది ఉధృతికి అంచెలంచెలుగా ప్రాంతం కోతకు గురవుతోందని, దీంతో తమ ఇళ్లు కూలిపోయే ప్రమాదం ఏర్పడిందని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవడంతో పాటు రక్షణ గోడలు నిర్మించాలని విన్నవించారు. దీనిపై స్పందించిన కలెక్టర్.. ప్రభావిత ప్రాంతాల గుర్తింపు ప్రక్రియ ప్రారంభమైందన్నారు. నిధులు మంజూరుకు ప్రతిపాదనలు పంపామని, మంజూరైన వెంటనే నిర్మాణాలు చేపడతామని భరోసా ఇచ్చారు. – రాయగడ

విశ్రాంత ఉపాధ్యాయులు సేవలందించాలి


కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న తెలుగు సంస్థల ప్రతినిధులు

- తెలుగు బోధనకు కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్ పిలుపు

రాయగడ: విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు బోధనకు ముందుకు రావాలని, అటువంటి వారికి గౌరవ వేతనం అందించేందుకు కృషి చేస్తామని కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్ పిలుపునిచ్చారు. ఉద్యోగ విరమణ చేసి, నిర్ణీత సమయంలో సేవలందించేందుకు ఆసక్తి చూపేవారిని మో స్కూల్ అభిజాన్ పథకంలో ఉపాధ్యాయులుగా నియమిస్తామించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలో అత్యధిక శాతం మంది తెలుగు ప్రజలు నివసిస్తున్న నేపథ్యంలో వారి పిల్లల చదువుల నిమిత్తం ప్రభుత్వం తెలుగు మాధ్యమం ప్రవేశ పెట్టింది. అయితే చాలా పాఠశాలల్లో తెలుగు ఉపాధ్యాయులు లేకపోవడంతో మూతపడే స్థితికి చేరుకున్నాయి. దీనిపై ప్రభుత్వం స్పందించి, తెలుగు విద్యావిధానాన్ని మెరుగు పరిచేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ రాయగడకు చెందిన తెలుగు సంస్థలు ఉత్కళ తెలుగు సమాఖ్య, స్పందన సాహితీ సాంస్కృతిక సంస్థ, రాయగడ రచయిత సంఘం(రారసం) ప్రతినిధులు కలెక్టర్‌ను బుధవారం కలిసి, వినతిపత్రం అందించారు. ఈ క్రమంలో స్పందించిన ఆమె.. పైవిధంగా సమాధానమిచ్చారు. చాలామంది తెలుగు ఉపాధ్యాయులు ఉద్యోగ విరమణ చేశారని, మరి కొందరిని ఇతర ప్రాంతాలకు బదిలీ చేశారని తెలిపారు. దీంతో స్థానిక పాఠశాలల్లో విద్యా బోధన అడుగంటి పోయిందని వాపోయారు. దీని నివారణకు చర్యలు చేపట్టి, విద్యార్థులకు మాతృభాష అభ్యాసనకు అవకాశం కల్పించాలని విన్నవించారు. కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు భళ్లమూడి నాగరాజు, రారసం అధ్యక్షుడు టీవీఎస్ఆర్ అప్పారావు, డాక్టర్ బాబురావు మహంతి, డాక్టర్ పతివాడ తులసీదాస్, కేకేఎం పట్నాయక్, పిల్లల శంకరరావు, గిడుతూరి సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ కాంగ్రెస్ ప్రదర్శనలు


అనిరుద్ శొబోరోకు పురస్కారం అందిస్తున్న హెచ్‌ఎం ప్రశాంత్ ప్రధాన్

పర్లాకిమిడి: జిల్లా కేంద్రంలోని మహారాజా బాలికల ఉన్నత పాఠశాలలో 'ఆరోగ్యం-స్వచ్ఛతకై మన ప్రయత్నం' అనే అంశంపై నిర్వహించిన జిల్లాస్థాయి సైన్స్ కాంగ్రెస్ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. రాష్ట్ర ఉన్నత విద్యాలయ శిక్షా ప్రాధీకరణ(ఓఎస్ఈపీఏ) సహకారంతో దీనిని ఏర్పాటు చేయగా, జిల్లా సైన్స్ కో-ఆర్డినేటర్ ఎ.రవికుమార్ ముఖ్య అతిథిగా హాజరై, ప్రారంభించారు. పోటీల్లో జిల్లాలోని 18 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో కాశీనగర్ సమితి ఖరడ బీఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి అనిరుద్ శొబోరోకు ఉత్తమ పురస్కారం లభించగా, జూనియర్ విభాగంలో గణితం, విజ్ఞానంపై జరిగిన పోటీల్లో 36మంది హాజరయ్యారు. కుమారి శివాంజలి, మినతి ప్రధాన్, నెరాసన్ గమాంగో లకు బహుమతులు లభించాయి. న్యాయనిర్ణేతలుగా మహారాజా బాలికల ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు ప్రశాంత్ ప్రధాన్, బీఈఓ(ఇన్‌చార్జి) బాలకృష్ణ మాఝి వ్యవహరించారు. జాజిపూర్ ప్రభుత్వ ప్రాథమిక అప్‌గ్రేడ్ పాఠశాల హెచ్‌ఎం సాత్విక్ పట్నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

కలప మిల్లుపై దాడి


అధికారులు స్వాధీనం చేస్తున్న కలప దుంగలు

బరంపురం: జిల్లా అటవీశాఖ ఆదేశాలతో కళ్లికోట్ రేంజ్ పరిధిలోని బెల్లజరి ప్రాంతంలో అటవీశాఖ అధికారులు బుధవారం దాడులు చేపట్టారు. గత కొంతకాలంగా అక్రమంగా నిర్వహిస్తున్న కలప మిల్లును సీజ్ చేసి, యంత్రాలు, కలపను స్వాధీనం చేసుకున్నామని డీఎఫ్‌ఓ అమ్లన్ నాయక్ తెలిపారు. అయితే అధికారుల రాకను ముందుగా పసిగట్టిన నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, నిందితుల కోసం గాలిస్తున్నామని డీఎఫ్‌ఓ పేర్కొన్నారు.

ఫైనాన్స్ ఏజెంట్ల పేరుతో మోసం

- బైక్‌తో పరారైన దుండగులు.. రకవరీ చేసిన పోలీసులు


పింకు పాత్రో


ప్రదీప్‌కుమార్


బులు పండా

జయపురం: ఫైనాన్స్ కంపెనీకి చెందిన సిబ్బందిగా నమ్మబలికి, ఓ వ్యక్తి నుంచి బైక్ లాక్కొని ఉడాయించిన నిందితులు పోలీసులకు పట్టుబడ్డారని జయపురం సదర్ పోలీసు అధికారి ఈశ్వర తండి బుధవారం వెల్లడించారు. వీరిలో జయపురం రెండో దైనిక బజార్‌కు చెందిన బులు పంధా(35), క్రిస్టియన్‌పేటకు చెందిన పింకు పాత్రో(40), పైల వీధికి చెందిన ప్రదీప్‌కుమార్ రాజపెల(40)ను అరెస్ట్ చేశామన్నారు. దీనిపై ఆయన తెలిపిన వివరాల ప్రకారం... ఈనెల 3న మధ్యాహ్నం 2గంటల సమయంలో సదర్ పరిధిలోని కొంజయిమాలిగుడ గ్రామానికి సత్య మాలి(25) తన బైక్‌పై పాత్రోపుట్ నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. గ్రామ కూడలి వద్ద పింకు, ప్రదీప్, బులు వాహనాన్ని ఆపి, తాము ఫైనాన్స్ కంపెనీ రకవరీ ఏజెంట్లమని నమ్మబలికారు. బైక్ రుణ వాయిదాలకు సంబంధించి ఇంకా 2నెలలు బకాయి రూ.7 వేలు చెల్లించాల్సి ఉందని తెలిపారు. అయితే తాను ఎటువంటి ఫైనాన్స్ కంపెనీకి బాకీ లేనని సత్య స్పష్టంచేశాడు. దీంతో దూకుడు పెంచిన దుండగులు.. డబ్బు చెల్లించకపోతే బైక్ తీసుకుంటామని చెప్పి, వాహనాన్ని ఎత్తుకుపోయారు. దీంతో బైక్ యజమాని సంబంధిత ఫైనాన్స్ కంపెనీని సంప్రదించగా, తమ వద్ద ఎటువంటి సిబ్బంది పని చేయడం లేదని సమాధానమిచ్చారు. మోసపోయానని గ్రహించిన సత్య.. పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు ప్రారంభించి, నిందితులను పట్టుకున్నారు. వారిని అరెస్ట్ చేసి, బైక్, 3 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వాహనాన్ని తిరిగి యజమానికి అప్పగించామని వివరించారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆటో

ఇంటి ముందు.. ఆటో మాయం..


నిందితుడు బాబుల్ నాగ్

జయపురం: స్థానిక సబ్ డివిజన్ పరిధి డుమురిగుడ గ్రామంలో ఈనెల 1న అపహరణకు గురైన ఆటోను రికవరీ చేశామని జయపురం సదర్ పోలీసు అధికారి ఈశ్వర తండి బుధవారం వెల్లడించారు. అదే గ్రామానికి చెందిన బాబుల్ నాగ్(22)ను నిందితుడిగా గుర్తించి, అరెస్ట్ చేశామన్నారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. గగనాపూర్ పంచాయతీ డుమురిగుడ గ్రామానికి చెందిన కృతిబాష్ హరిజన్‌కు తన ఆటోను జూన్ 30న ఇంటి ముందు పార్కింగ్ చేసి ఉంచాడు. తెల్లవారు చూసే సరికి ఆటో మాయం కావడంతో బొయిపరిగుడ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు.. బాబుల్ నాగ్‌పై అనుమానం వ్యక్తం చేశారు. అతనిని అదుపులోకి తీసుకొని, తమదైన శైలిలో విచారించగా నేరం అంగీకరించాడు. ఆటోను దొంగిలించి, సునాబెడ పోలీస్ స్టేషన్ సమీపంలో వదిలి, ఇంటికి తిరిగి వచ్చినట్లు తెలిపాడు. ఈ మేరకు అక్కడికి వెళ్లి చూడగా, వాహనం లభించింది. ఆటోను తీసుకు వచ్చిన పోలీసులు.. ధ్రువపత్రాలు పరిశీలించిన అనంతరం యజమాని కృతి హరిజన్‌కు అప్పగించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరు పరిచామని ఐఐసీ వివరించారు.

ప్రజారోగ్యంపై శ్రద్ధ వహించాలి


మాట్లాడుతున్న కలెక్టర్ దివ్యజ్యోతి పరిడా

బరంపురం: ప్రభుత్వ ఆరోగ్య చికిత్స కేంద్రాల్లో సేవలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సబంధిత అధికార్లను జిల్లా కలెక్టర్ దివ్యజ్యోతి పరిఢా ఆదేశించారు. జిల్లా కేంద్రమైన ఛత్రపూర్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో రాష్ట ఆరోగ్య కల్యాణ విభాగం ఆధ్వర్యంలో ప్రజారోగ్యంపై సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు రాష్టంలో అతి పెద్ద జిల్లాగా ఉన్న గంజాంలో డెంగీ, మలేరియా, డయేరియా, ఉబ్బసం, కుష్టు, బోధకాలు తదితర వ్యాధులతో బాధపడుతున్న వారిని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో చేర్పించి, మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రులకు ప్రజలు ఎంతో నమ్మకంతో వస్తారని, దానిని వమ్ము చేయకుండా ఉత్తమ సేవలు అందించాలని కోరారు. సమావేశంలో వివిధ విభాగాలకు చెందిన వైద్యులు, జిల్లా పాలనాధికారులు పాల్గొన్నారు.

విజిలెన్స్‌కు చిక్కిన ఆర్ఐ


ఆర్ఐను విచారిస్తున్న విజిలెన్స్ అధికారి

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రానికి సమీపంలోని గౌడ్‌గూడ పంచాయతీకి చెందిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సింహాచల్ సాహు విజిలెన్స్ అధికారులకు బుధవారం చిక్కారు. గౌడిగూడ వద్ద నిర్మిస్తున్న ఎయిర్ స్ట్రిప్ పనుల్లో భాగంగా కొంతమంది గిరిజనులు ఇళ్లను కోల్పోయారు. వారికి స్థలాలు కేటాయించడం తోపాటు నష్ట పరిహారంగా రూ.7 లక్షల 55 వేలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో మాయారాణి మండాల్ అనే మహిళకు పరిహారం సొమ్ము రావాల్సి ఉండగా, దీనిని అందించేందుకు తనకు రూ.25 వేలు లంచంగా ఇవ్వాలని ఆర్ఐ డిమాండ్ చేశారు. దీనిపై ఆమె జిల్లా ఉన్నాతాధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో ఓ స్వచ్ఛంద సంస్థను ఆశ్రయించింది. వారి సాయంతో విజిలెన్స్ అధికారులకు సమాచారం అందించగా, పక్కా పథకం ప్రకారం డబ్బులు తీసుకుకుంటున్న సమయంలో ఆర్ఐ సింహాచల్‌ను అరెస్ట్ చేశారు. ముందుగా అతనిని మల్కన్‌గిరి విజిలెన్స్ కార్యాలయానికి తరలించారు. అనంతరం కొరాపుట్‌కు చేర్చారు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని అధికారులు తెలిపారు.

ఊరూరా వన మహోత్సవాలు


మొక్కలు నాటుతున్న కావుడిగుడ పాఠశాల విద్యార్థులు, అధికారులు


పర్లాకిమిడి: మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు

జయపురం: వన మహోత్సవాల్లో భాగంగా వివిధ ప్రాంతాల్లో మొక్కలు నాటే కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయి. స్థానిక సబ్ డివిజన్ పరిధి కుంద్రా సమితిలోని వివిధ పాఠశాలల్లో బుధవారం వన మహోత్సవాలునిర్వహించారు. కావుడిగుడ ప్రాథమిక విద్యాలయంలో జయంతి కుశపొరియ ముఖ్య అతిథిగా పాల్గొనగా, విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి పండ్ల మొక్కలు నాటారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అరవింద బారిక్, సన్య రాంపురియ, రంజన్ గదబ, ప్రహ్లాద్ బారిక్, వార్డు సభ్యురాలు రేణు సునా, ఉద్యానశాఖ అధికారులు, అటవీశాఖ లిమా సెక్టార్ అధికారి బింధు ఖిలో, ఫారెస్ట్ గార్డులు పుష్పాంజలి నాయక్, వందన దాస్ తదితరులు పాల్గొన్నారు. బొరిగుమ్మలో సత్యసాయి మందిరం ప్రాంగణంలో భక్తులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో సేవాసమితి సభ్యులు సరోజ్‌కుమార్ దాస్, దీనబంధు త్రిపాఠి, జ్యోతి పట్నాయక్, రోజి దొర, ఎస్.కృష్ణవేణి, ఎస్.అభిషేక్, ఎస్.సాయి, శివప్రసాద్ మహంతి తదితరులు పాల్గొన్నారు.


వన మహోత్సవంలో బొరిగుమ్మ సత్యసాయి భక్తులు

జాజిపూర్ పాఠశాలలో..

పర్లాకిమిడి: జిల్లాలోని గుసాని సమితి జాజిపూర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో 74వ వన మహోత్సవం కార్యక్రమాన్ని హెచ్‌ఎం సాత్విక్ పట్నాయక్ ఆధ్వర్యంలో బుధవారం జరిపారు. డీఈఓ ప్రదోష్‌కుమార్ నాయక్ ఆదేశాల మేరకు దేవగిరి అటవీశాఖ అధికారి అందజేసిన ఉసిరి, నిమ్మ, మారడి మొక్కలను రిటైర్డ్ ఇన్‌స్పెక్టర్ సురేంద్రపాత్రో, స్కౌట్స్ అండ్ గైడ్స్, ఉపాధ్యాయ సిబ్బంది సహకారంతో నాటారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ధీరేంద్ర సామల్, నర్మదా దెయి, ఎం.ప్రియాంక పండా, చోపల పాఢి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కలెక్టర్‌కు గ్రేడ్‌-2 వీఆర్వోల సత్కారం


కలెక్టర్ లాఠకర్‌ను సత్కరిస్తున్న గ్రేడ్‌-2 వీఆర్వోలు

శ్రీకాకుళం పాతబస్టాండ్‌: గ్రేడ్‌–2 వీఆర్వోలకు ప్రభుత్వం ప్రొహిబిషన్‌ను ఖరారు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆనందం వ్యక్తం చేస్తూ.. జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ బి. లాఠకర్‌ను వారంతా బుధవారం తన చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. దుశ్శాలువ, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. కార్యక్రమంలో వీఆర్వోల సంఘం రాష్ట్ర నాయకులు రమేష్ కుమార్, అప్పలనాయుడు, వేణు ఉన్నారు.

సీఎండీ చేతికి 'ట్రాన్స్‌ఫార్మర్' నివేదిక

అరసవల్లి: అరసవల్లి శివారులోని లక్ష్మీనగర్‌లో అక్రమంగా ఏర్పాటు చేసిన 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ వ్యవహారంలో డీ–1 ఏఈ కమల్‌హాసన్ నిర్వాకంపై ఈపీడీసీఎల్ ఎనర్జీ ఆడిట్ జనరల్ మేనేజర్ కె.చలపతిరావు విచారణను పూర్తి చేశారు. స్థానికంగా ఉన్న వాస్తవ పరిస్థితులను ఆయన స్వయంగా పరిశీలించి నివేదికను రూపొందించారు. ఈమేరకు బుధవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ.. లక్ష్మీనగర్ కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్‌పై విచారణ చేపట్టామని..ఇది అక్రమ వ్యవహారమే అని గుర్తించామన్నారు. ఈమేరకు పూర్తి వివరాలతో సీజీఎం విజయలలితకు బుధవారం అప్పగించినట్లుగా తెలియజేశారు. అక్కడి నుంచి సీఎండీ పృథ్వీతేజ్‌కు నివేదిక చేరనుందన్నారు. ఇదిలావుంటే మరోపక్క చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ ఎ.వి.ఎల్.ప్రసన్నకుమార్ ఆదేశాల మేరకు విద్యుత్ విజిలెన్స్ అధికారులు కూడా ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు సమీప ప్రాంతాలు, అపార్ట్‌మెంట్ల వద్ద ఉన్న డెడికేటెడ్ ట్రాన్స్‌ఫార్మర్లు, డీ–1 ఏఈ కమల్‌హాసన్ ఇంటి వరకు ఉన్న విద్యుత్ స్తంభాల పరిస్థితులను స్వయంగా పరిశీలించి ప్రత్యేక నివేదికను సిద్ధం చేస్తున్నారు.

రైల్ నిలయం సమస్యల పరిష్కారానికి కృషి


రైల్వే స్టేషన్‌ను పరిశీలిస్తున్న డీఆర్ఎం రింకేష్‌రాయ్ తదితరులు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం రైల్ నిలయంలో నెలకున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఖుర్దా డివిజన్ డీఆర్ఎం రింకేష్ రాయ్ చెప్పారు. స్థానిక రైల్ నిలయంలోని సమస్యల గురించి స్థానిక ప్రజాప్రతినిధులు, రైల్‌యూజర్ కమిటీ సభ్యులు డీఆర్ఎం దృష్టికి గతంలో తీసుకెళ్లారు. దీంతో ఆయన బుధవారం స్థానిక రైల్ నిలయాన్ని సందర్శించారు. ఆర్‌ఓబీ ఏర్పాటుకు ఎల్‌సీగేట్ వద్ద గల పరిస్థితులతో పాటు స్థానికులు ప్రతిపాదించిన సమీపంలోని అండర్‌పాసెజీకి నిర్మాణం ఏర్పాటుకు అనువైన ప్రదేశం ఉన్నది లేనిది సంబంధిత అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు, స్థానిక ఎంఎల్ఏ బెందాళం అశోక్ డీఆర్ఎంని కలిసి జిల్లాలో కొన్ని రైల్వేస్టేషన్లను అభివృద్ధి చేసి మౌలిక వసతులు కల్పించాలని కోరారు.

108 వాహనాన్ని ఢీకొట్టిన బొలేరో..

బూర్జ: రోగిని తీసుకుని వెళ్తూ ఆగి ఉన్న 108 వాహనాన్ని వెనుక నుంచి వచ్చిన బొలేరో వాహనం ఢీకొట్టింది. ఈ సంఘటన మండలంలో బొమ్మిక జంక్షన్ ప్రధాన రహదారిపై మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తూరు నుంచి 108 వాహనంలో రోగిని తీసుకుని శ్రీకాకుళం వెళ్తూ మార్గమధ్యలో బొమ్మిక జంక్షన్ వద్ద రోడ్డు పక్కన డ్రైవర్ నిలుపుదల చేశారు. ఇదే క్రమంలో పాలకొండ నుంచి శ్రీకాకుళం వెళ్తున్న బొలేరో వ్యాన్ వెనుక నుంచి 108 వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో 108 వాహన డ్రైవర్.. బత్తిలి గ్రామానికి చెందిన నల్లాన మోహనరావుకి స్వల్ప గాయాలు కావడంతో పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మోహనరావు ఫిర్యాదు మేరకు ఎస్సై బి.అశోక్ బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదంలో బొలేరో ముందు భాగం నుజ్జునుజ్జయింది.

శ్రీకూర్మనాథున్ని దర్శించుకున్న సుశీంద్ర తీర్థస్వామి


శ్రీకూర్మనాథాలయంలో సుశీంద్ర తీర్థస్వామీ

గార: విష్ణుక్షేత్రం శ్రీకూర్మం కూర్మనాథున్ని ఉడిపికి చెందిన కార్తీకేయ మఠం పీఠాధిపతి సుశీంద్ర తీర్థస్వామీజీ బుధవారం ఉదయం దర్శించుకున్నారు. ముందుగా ఆలయ మర్యాదులతో అర్చకులు, అధికారులు ఎదురేగి స్వాగతం పలికారు. అనంతరం మూలవిరాట్ వద్ద ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. శ్రీకూర్మానాథాలయం విశిష్టమైనదని, తప్పనిసరిగా దర్శించదగ్గ క్షేత్రమన్నారు. ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు ఆశీర్వచనాలు అందజేశారు.

విచారణకు ఓకే..


పూరీ జగన్నాథాలయం..

- పూరీ జగన్నాథాలయ ఖజానా తెరవాలని పిటీషన్
- విచారణకు అంగీకరిస్తూ నోటీసులు జారీ చేసిన హైకోర్టు
- ప్రతివాదులుగా గజపతి మహారాజా సహా మరో నలుగురు

భువనేశ్వర్: పూరీ జగన్నాథ ఆలయంలోని రత్న భండార్‌ను(స్వామి ఆభరణాల ఖజానా) తెరవాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను ఒడిశా హైకోర్టు విచారణకు స్వీకరించింది. ఈ సందర్భంగా పూరీ గజపతి మహారాజా దివ్య సింగ్ దేవ్‌తో సహా నలుగురు ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. ఆలయ ప్రధాన పాలన అధికారి(సీఏఓ) రంజన్‌కుమార్ దాస్, పాలకమండలి చైర్మన్, గజపతి మహారాజా, భారత పురావస్తు శాఖ(ఏఎస్ఐ) డైరెక్టర్ జనరల్, ఒడిశా సూపరింటెండెంట్ లకు నోటీసులు పంపించారు. బీజేపీ రాష్ట్రశాఖ మాజీ అధ్యక్షుడు సమీర్ మహంతి ఈ కేసు దాఖలు చేయగా, ఆగస్టు 7న విచారణకు తేదీ ఖరారు చేశారు. రత్న భండార్‌లో ఉంచిన జగన్నాథుని ఆభరణాలు, ఇతర ఆభరణాల జాబితా తయారీని పర్యవేక్షించేందుకు గవర్నర్ లేదా హైకోర్ట్ సిట్టింగ్ జడ్జి అధ్యక్షతన హైపవర్ కమిటీని ఏర్పాటు చేయాలని పిటిషనర్ కోరారు. స్వామి ఆభరణాల భాండాగారం శిథిలావస్థకు చేరుకున్నా రాష్ట్రప్రభుత్వం అవసరమైన మరమ్మతు పనులు చేపట్టడం లేదని ఆయన ఆరోపించారు.

గల్లంతుపై సీబీఐ విచారణ..

భారత పురావస్తు శాఖ(ఏఎస్ఐ), సాంకేతిక నిపుణుల కమిటీ సిఫార్సుల ప్రకారం రత్నభండార్ లోపలి గోడ మరమ్మతు, నిర్మాణ పనులను చేపట్టడానికి రత్న భండార్‌ను తెరవాల్సి ఉంది. రత్నభండార్ తాళం చెవి గల్లంతు ఘటనపై సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్(సీబీఐ)తో విచారణ జరిపించాలని సమీర్ మహంతి హైకోర్టుకు అభ్యర్థించారు. తాళం చెవి గల్లంతుపై విచారణకు జ్యుడీషయల్ కమిషన్‌ను ఏర్పాటు చేసినప్పటికీ.. రాష్ట్ర ప్రభుత్వం, న్యాయ కమిషన్ విచారణ నివేదికను అసెంబ్లీలో ప్రవేశ పెట్టలేదని ఎద్దేవా చేశారు.

చట్టప్రకారం జరగాల్సిందే..

చట్టాల ప్రకారం, రత్న భండార్‌లో ఉంచిన ఆభరణాల జాబితాను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలి. కానీ ఇది జరగలేదు. రత్నభండార్ లోపలి గోడలో ఏర్పడిన పగుళ్లను సరిచేయడానికి ఆలయ నిర్వహణ కమిటీ తాళం తెరవాలని ఇప్పటికే ప్రభుత్వాన్ని అభ్యర్థించింది. ఈ మేరకు రాష్ట్రప్రభుత్వ నిర్ణయం వెల్లడి కాలేదని పూరీ గజపతి మహారాజా దివ్యసింగ్ దేవ్ విచారం వ్యక్తం చేశారు. రత్నభండార్ చివరి సారిగా 2018 ఏప్రిల్‌లో తెరిచారు. భారత పురావస్తు శాఖ(ఏఎస్ఐ) నిపుణులతో సహా 16 మంది సభ్యుల బృందం రత్నభండార్ బయటి గదిలోకి ప్రవేశించింది. ఈ ప్రాంగణం నుంచి సాధ్యమైనంత వరకు తాజా స్థితిగతులను సమీక్షించింది. ఈ సందర్భంగా లోపలి గది(మిద్దె) తాళం చెవి గల్లంతైన ఉదంతం తీవ్ర కలకలం రేపింది. తాళం లేకపోవడంతో లోపలి మిద్దె తనిఖీలు సాధ్యం కాలేదు. కనుమేరల్లో స్థితిగతుల సమీక్ష ప్రకారం గోడలు బీటలు వారినట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో సత్వర నిర్వహణ, మరమ్మతు పనులు చేపట్టాలని నిపుణుల బృందం రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. ఈ సిఫార్సు పట్ల రాష్ట్రప్రభుత్వం వైఖరి స్పష్టం కాకపోవడంతో సర్వత్రా పలు సందేహాలు తలెత్తుతున్నాయి.

'విద్యార్థులకు ఆదర్శం.. త్రిషా తన్య'


కవితా సంకలనాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

జయపురం: ప్రతి విద్యార్థిలోనూ తమదైన ప్రతిభ దాగి ఉంటుందని, దానిని సద్వినియోగ పరిస్తే ఎన్నో విజయాలు సాధించవచ్చని తారాబట్ట ఆదర్శ కళాశాల ప్రిన్సిపాల్ రాజీవలోచన పటేల్ అన్నారు. బొరిగుమ్మ టౌన్ హాలులో విద్యార్థిని ఎస్.త్రిషా తన్య రచించిన 'సెంటిమెంట్స్ ఆఫ్ అడల్‌సెంట్' అనే ఆంగ్ల కవితా సంకలనాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిగ్రీ చదువుతున్న వయసులోనే ఆంగ్లంలో కవిత రాయడం ఎంతో అభినందనీయమన్నారు. చిన్నతనంలోనే ఇంగ్లిషుపై పట్టు సాధించడం ఎందరికో ఆదర్శమన్నారు. త్రిషా గతంలో రచించిన 'ఎ నోట్ వాట్ ఐ థాట్' పుస్తకం ఎంతో ఆలోచింపజేసిందని కొనియాడారు. భవిష్యత్‌లో మరిన్ని రచనలతో సమాజంలో చైతన్యం తీసుకు రావాలని ఆకాంక్షించారు. అలాగే విద్యార్థిని తల్లిదండ్రులు ఎస్.రాజేష్ కుమార్, గాయత్రీ లను ప్రశంసించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సరోజ్ ప్రహరాజ్, సీనియర్ పాత్రికేయులు ఆర్.మాధవరావు పట్నాయక్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పవిత్ర దాస్, జయపురం బ్లాక్ విద్యాశాఖ అధికారి చందన నాయక్ ప్రసంగించారు. బిజయ రథ్, రుషీకేష్ మహరాణా, సత్య ఆచారి, ఎస్.కామేశ్వరరావు, అశోక్ బెహరా, అశోక్ షాడంగి, మనోజ్ బిశాయి, రమాకాంత బెహరా, మత్యుంజయ పండా, అజిత్ గంతాయత్, కిశోర్ సాహు తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

వంశధార స్థలం వివాదంపై విచారణ

- కలెక్టర్ ఆదేశాలతో కదలిక


వంశధార అతిథిగృహంలో దర్యాప్తు చేపడుతున్న ఈఈ శ్రీకాంత్

హిరమండలం: వంశధార కార్యాలయానికి కూతవేటు దూరంలో పది సెంట్ల వివాదాస్పద భూమిని టెక్కలి ఈఈ కె.శ్రీకాంత్ బుధవారం పరిశీలించారు. కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠ్కర్ ఆదేశాల మేరకు విచారణ చేపట్టారు. కోరాడ రెవెన్యూ పరిధిలో వంశధార కార్యాలయం ఉంది. అక్కడ సెంటు భూమి రూ. లక్షల్లో పలుకుతుంది. సర్వే నంబర్ 230/7బీలో పది సెంట్ల ఖాళీ స్థలంపై కార్యాలయ ఉద్యోగి కన్నుపడింది. దీంతో స్థలం వంశధార కార్యాలయానికి అవసరం లేదని.. రెవెన్యూ శాఖకు అప్పగించాలని ఓ ఫైల్ సిద్ధం చేశాడు. 2021 డిసెంబరు 16వ తేదీన అప్పటి వంశధార ఈఈ సుశీల్ కుమార్ వద్దకు ఫైల్ చేరింది. అప్పట్లో ఏమరపాటుగా ఫైల్ పై ఈఈ సంతకం చేశారు. 2022 మే 12న ఆ తప్పిదాన్ని గుర్తించి వెనువెంటనే రెవెన్యూ అధికారులకు ఈఈ సుశీల్‌కుమార్ లేఖ రాశారు. అది వంశధార కార్యాలయ అవసరాలకు ఉపయోగించాల్సిన భూమి అని.. దానిని వెనక్కి తీసుకుంటున్నట్టు లేఖలో పేర్కొన్నారు. కానీ రెవెన్యూ అధికారుల నుంచి ఎటువంటి స్పందన లేదు. దీంతో అక్కడకు కొద్దిరోజుల తరువాత కలెక్టర్‌కు లేఖ రాశారు. కలెక్టర్ రెవెన్యూ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. దీనిపై విచారణ చేపట్టి ఆ స్థలం వంశధార అధికారులకు వెనక్కి ఇవ్వాలని ఆదేశించారు. అయినా సరే రెవెన్యూ అధికారులు పట్టకుండా వ్యవహరించారు. అటు తరువాత ఈఈ బదిలీపై వెళ్లిన అక్కడకు కొద్దిరోజులకే అనారోగ్యంతో మృతిచెందారు. ఈ నేపథ్యంలో ఈ అంశం మరుగునపడిందని అంతా భావించారు. కానీ అనూహ్యంగా జలవనరుల శాఖ జిల్లా పర్యవేక్షణ అధికారి దృష్టిపెట్టారు. విచారణకు ఆదేశించారు. వంశధార టెక్కలి ఈఈ శ్రీకాంత్‌ను విచారణ అధికారిగా నియమించారు. ఈ మేరకు ఆయన బుధవారం కార్యాలయంలో విచారణ చేపట్టారు. అక్కడ పనిచేస్తున్న ఉద్యోగులను ప్రశ్నించారు. రికార్డులను, పది సెంట్ల ఖాళీ స్థలాన్ని పరిశీలించారు. అయితే ఇది నా స్థలం అంటూ ఎవరూ ముందుకు రాలేదు. దీనికి సూత్రధారిగా భావిస్తున్న ఇంటిదొంగ సైతం ఎటువంటి హడావుడి చేయలేదు. దీనిపై నివేదిక కలెక్టర్‌కు అందించనున్నట్టు ఈఈ శ్రీకాంత్ తెలిపారు. ఆయన వెంట వంశధార అధికారులు ఉన్నారు.

400 జీడి పరిశ్రమలు బంద్

కాశీబుగ్గ: మార్కెట్‌లో జీడిపప్పు ధరలు తగ్గుముఖం పట్టాయని, తిరిగి మార్కెట్ పునరుద్ధరించుకునేంత వరకు జీడి పరిశ్రమలు మూసివేస్తామని పీసీఎంఏ, ఇండస్ట్రియల్ ఏరియా యాజమాన్య సంఘాలు ప్రకటన విడుదల చేశాయి. ఈ మేరకు బుధవారం పలాస, మొగిలిపాడు, ఇంగిలిగాం, ఇండస్ట్రియల్ ఏరియా, హరిపురం, మందస, వజ్రపుకొత్తూరులలో ఉన్న 400 పైగా జీడి పరిశ్రమలు మూతపడ్డాయి. ఆగస్టు 1 వరకు వరకు బంద్ కొనసాగనుంది. మార్కెట్‌లో వివిధ రకాల జీడి పప్పు ధరలు కేజీకి రూ.150 నుంచి రూ.200 వరకు ధరకు తగ్గుముఖం పట్టాయని, అందుకే కార్మిక సంఘాలతో మాట్లాడి పరిశ్రమలు మూసివేస్తున్నామని యాజమాన్య ప్రతినిధులు తెలిపారు. అయితే ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 25 వేల మంది ఈ పరిశ్రమలపై ఆధారపడి జీవిస్తున్నారని 25 రోజులు పాటు బంద్ జరిగితే ఇబ్బందులు పడాల్సి వస్తుందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉద్దాన ప్రాంతంలో ఉన్న రైతులకు గిట్టుబాటు ధర అందడం లేదని ఏప్రిల్ నుంచి వారంతా పోరాటాలు చేస్తున్న నేపథ్యంలో యాజమాన్యాలు కక్షసాధింపుకు దిగడంలో భాగంగానే బంద్ చేస్తున్నారని పలువురు అభిప్రాయపడుతున్నారు.

జోరుగా ఆక్రమణల తొలగింపు


బాన నాలాలో చెత్తను తొలగిస్తున్న సిబ్బంది


పనులను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే విక్రమ్ పండా, మేయర్ సంఘమిత్ర, కమిషనర్ సోనాల్


పూర్ణఘడ్‌లో రోడ్డుపై ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం


రోడ్డుపై నిర్మించిన ఇంటిని పడగొట్టిన అధికారులు

బరంపురం: నగరంలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఉత్తరం వైపు ఉన్న బాన నాలా ఉప్పొంగింది. ఒకవైపు సప్పువా నాలా, మరోవైపు బాన నాలా కాలువుల పొంగి ప్రవసిస్తున్నాయి. దీని ఫలితంగా చుట్టపక్కల ఉన్న జ్యోతినగర్, గజపతి నగర్, శారదాబాలి కాలనీల్లో ఉన్న ఇళ్లల్లోకి మురుగు నీరు చొరబడి, ఇబ్బందులకు గురిచేసింది. విషయం తెలుసుకున్న బరంపురం మున్సిపాలిటీ కార్పొరేషన్ మేయర్ సంఘమిత్ర దొళాయి, కమిషనర్ సోనమ్ జెన్నా, ఎమ్మెల్యే విక్రమ్ పండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. నగరంలో డ్రైనేజీ వ్యవస్థకు అంతరాయం కలిగించేలా ఉన్న అక్రమ నిర్మాణాలను గుర్తించారు. వెంటనే సిబ్బందిని పిలిపించి, ఆక్రమణల తొలగింపును దగ్గరుండి పర్యవేక్షించారు. బాన నాలా, సప్పువా నాలా లను శుభ్రం చేయించారు.

జయపురం మున్సిపాలిటీలో..

జయపురం: స్థానిక మున్సిపాలిటీలో రోడ్లను ఆక్రమించి, రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్న ఆక్రమణలను తొలగించేందుకు అధికార యంత్రాంగం శ్రీకారం చుట్టింది. ఈ మేరకు 16వ వార్డులో అక్రమ నిర్మాణాలను యంత్రాల సాయంతో పడగొట్టామని మున్సిపల్ ఈఓ సిద్ధార్థ పట్నాయక్ తెలిపారు. పూర్ణఘడ్‌లో రోడ్డును పలువురు ఆక్రమించడం వల్ల ప్రజలు నడిచేందుకు సైతం ఇబ్బందులు పడుతున్నారని, నివారణకు చర్యలు చేపట్టామని వివరించారు. ఇతర ప్రాంతాల్లో సైతం ఇదే తరహా నిర్ణయం తీసుకుంటామన్నారు.

కలుపు నివారణే కీలకం

- వెద పద్ధతిలో వరి సాగు చేస్తున్న రైతులకు వ్యవసాయాధికారుల సూచన


వెద పద్ధతిలో వరి విత్తనాలు వేస్తున్న రైతు

ఆమదాలవలస రూరల్: వెద పద్ధతిలో వరిపంటను సాగు చేస్తున్న రైతులు కలుపు నివారణపై ప్రత్యేక దృష్టిసారించాలి. కలుపు మొక్కలు పోషకాలు, నీరు, సూర్యరశ్మి కోసం ప్రధాన పంటతో పోటీపడుతుంటాయి. దీంతో పంట దిగుబడి, నాణ్యతను గణనీయంగా తగ్గిపోయే ప్రమాదం ఉంది. కలుపు మొక్కల నివారణపై దృష్టిసారించకపోతే వెద సాగులో 35–45 శాతం, తడి (దమ్ము పట్టి) చేసే సాగులో 20–25 శాతం, నాట్లు వేసే పద్ధతిలో 10–15 శాతం దిగుబడిని తగ్గిస్తాయి. కలుపు మొక్కలు చీడ పీడలకు అవాసంగా మారి వాటి ఉద్ధృతి ఎక్కువ కావడానికి దోహదం చేస్తాయి. పంట కోత సామర్థ్యాన్ని తగ్గిస్తాయి. నీటి, వాయు కాలుష్యానికి కారకాలుగా మారుతాయి. కలుపు నివారణకు వివిధ పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని ఆమదాలవలస మండల వ్యవసాయాధికారి మెట్ట మోహనరావు రైతులకు సూచించారు. జిల్లాలో 1.70 లక్షల హెక్టార్లలో వరిసాగు విస్తీర్ణం జరుగుతుండగా, తగిన వ్యవసాయ పద్ధతులు పాటిస్తే కలుపు నివారించుకోవచ్చునని స్పష్టం చేశారు.

విత్తనం, కలుపు రాకముందు నివారణ..

అన్ని రకాల కలుపు మొక్కల నివారణకు విత్తిన 2–3 రోజుల్లో కలుపు నివారణ మందులను వాడాలి. ప్రీతిలాక్లోర్ (ఏరేజ్, చెక్, ఫైలెట్, రిఫిట్, రేసర్ అనే పేర్లతో మార్కెట్‌లో దొరుకుతుంది) మందును రెండు మిల్లీ లీటర్లను లీటరు నీటికి కలిపి ఎకరానికి ఒకరు లీటరు మందును పిచికారీ చేయాలి. లేదంటే అక్సాడయార్జిల్ 35 గ్రాముల మందును 200 లీటర్ల నీటిలో కలిపి తేమ బాగా ఉన్నప్పుడు పిచికారీ చేయాలి. మొదట తేమశాతం సరిలేనప్పుడు 5–7 రోజుల్లో, తేమ లభ్యమైనప్పుడు పైరజో సల్ఫ్యూరస్ ఈథైల్ (సాతి అని మార్కెట్‌లో దొరుకుతుంది) రసాయన మందును ఎకరానికి 80 గ్రాముల మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

విత్తనం వేశాక నివారణ ఇలా..

- కలుపు వయస్సు 20–25 రోజుల (2–4 ఆకుల దశ)లో తగినంత తేమ ఉన్నప్పుడు మాత్రమే కలుపు మందులు పనిచేస్తావనే విషయాన్ని రైతులు గమనించాలి. కలుపు జాతుల రకాల ఆధారంగా వాటి దశను అనుసరించి కలుపు మందులు ఎంచుకోవాలి. ఊద ఎక్కువగా ఉంటే 15–20 రోజుల సమయంలో సై హెలో పాప్ బుటైల్ (క్లించర్, రాప్ అప్ అనే పేర్లతో మార్కెట్‌లో దొరుకుతుంది) మందును రెండు మిల్లీ లీటర్లు లీటరు నీటికి కలిపి ఎకరానికి 400 మిల్లీ లీటర్లు మందును తేమ బాగా ఉన్నప్పుడు పిచికారీ చేయాలి.
- గడ్డి జాతులు, వెడల్పు ఆకు జాతి కలుపును నివారించుటకు 8–25 రోజలు వ్యవధిలో (2–4 ఆకుల దశ) బిస్పైరీబాక్ సోడియంను (నామినీ గోల్డ్, తాకర్, అడోరా వంటి రకాలు) ఎకరానికి 100 మిల్లీ లీటర్లు మందును 200 లీటర్ల నీటిలో కలిపి తేమ బాగా ఉన్నప్పుడు పిచికారీ చేయాలి. వారం రోజుల్లో కలుపు అంతా చనిపోతుంది.
- ఆరిక గడ్డి, పూతిక గడ్డి, చిప్పెర, గుంపుల గడ్డి, తుంగ, మొండి గడ్డి జాతులు ఉన్నప్పుడు 20–25 రోజుల సమయంలో ఫెనొక్షి ప్రోప్–పి–ఈథైల్ (రైస్ స్టార్ 6.7 శాతం లేదా విప్ సూపర్ 9.3 శాతం) 250 మిల్లీ లీటర్ల మందును 200 లీటర్ల నీటిలో కలిపి తేమ బాగా ఉన్నప్పుడు పిచికారీ చేయాలి. 4–5 రోజుల తరువాత పలుచగా నీటిని పెడితే వారం రోజుల్లో కలుపు చనిపోతుంది.
- మొండి గడ్డి జాతులతో పాటు వెడాల్పు ఆకు జాతి కూర గడ్డి ఉంటే మెటసల్ఫ్యూరోన్ మిథైల్, క్లోరోమ్యూరాన్ ఈథైల్ రసాయన మందు (ఆలిమ్క్స్)ను ఎకరాకు 8 గ్రాములు కలుపుకుని ఇథాక్షి సల్ఫ్యూరాన్ (సన్ రైస్) మందును 50 గ్రాములను కలిపి ట్యాంక్ మిశ్రమాన్ని పిచికారీ చేయాలి.
- పొలంలో కూర గడ్డి జాతి కలుపు ఉంటే 25–30 రోజుల సమయం వరకు 2.4 డి సోడియం సాల్ట్‌ను 400 గ్రాములు లేదా మెటసల్ఫ్యూరోన్ మిథైల్, క్లోరోమ్యూరాన్ ఈథైల్ రసాయన మందు (ఆల్మిక్స్)ను ఎకరానికి 8 గ్రాములు కలుపుకోవాలి. ఇథాక్షి సల్ఫ్యూరాన్ (సన్ రైస్) మందును 50 గ్రాములు 200 లీటర్ల నీటికి కలిపి పలుచగా నీరు ఉన్నప్పుడు పిచికారీ చేయాలి.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన ఆటో

- నలుగురికి గాయాలు


చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

మెళియాపుట్టి: ద్విచక్ర వాహనాన్ని ఆటో ఢీకున్న ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. క్షతగాత్రులంతా ఒకే కుటుంబానికి చెందిన వారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని బాణాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని సవర గుమ్మడ గ్రామానికి చెందిన సవర గంగరాజు కుటుంబంతో కలిసి ద్విచక్ర వాహనంపై చాపర ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి వస్తున్నారు. జోడూరు గ్రామసమీపంలో ఆటో రాంగ్ రూట్‌లో వచ్చి వీరి వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో గంగరాజు, అతని భార్య చొంపమ్మ, కుమార్తె రియాశ్రీ, తండ్రి చిన్న రెల్లి గాయాలపాలయ్యారు. ద్విచక్ర వాహనం ముందు పాప రియాశ్రీ కూర్చుంది. చిన్నారి రోడ్డుపై పడిపోవడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను చాపర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం టెక్కలి జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేశారు. కాగా ప్రమాదంపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై టి.రాజేష్ చెప్పారు.

46 మందికి గ్రేడ్‌-2 హెచ్‌ఎంలుగా పదోన్నతి


పదోన్నతి పొందిన వారికి అపాయింట్‌మెంట్ ఆర్డర్ అందజేస్తున్న ఆర్జేడీ జ్యోతికుమారి

మధురవాడ: ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల పరిధిలో 46 మంది స్కూల్ అసిస్టెంట్లకు ప్రభుత్వ నిర్వహణలోని పాఠశాలల్లో గ్రేడ్–2 హెచ్‌ఎంలుగా పదోన్నతి కల్పించినట్టు ఆర్జేడీ ఎం.జ్యోతికుమారి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆదేశాలు జారీ చేసి.. వెంటనే అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు. మధురవాడలోని జోన్–1 పాఠశాల విద్యా శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ కార్యాలయంలో స్కూల్ అసిస్టెంట్లకు హెచ్‌ఎంలుగా పదోన్నతి కలిపించే ప్రక్రియ మంగళవారం అర్ధరాత్రి వరకు కొనసాగింది. ఉమ్మడి విశాఖలో 25, విజయనగరంలో 7, శ్రీకాకుళంలో 14 కలసి మొత్తం 46 పోస్టులు ఖాళీ ఉన్నట్లు అధికారులు నిర్ధారించి కౌన్సెలింగ్ చేపట్టారు. మొత్తం 72 మంది కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. ఇందులో ముగ్గురు ప్రమోషన్ వద్దన్నారు. దీంతో వారి తర్వాత స్థానంలో ఉన్న వారికి ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి కల్పించారు. పదోన్నతి పొందిన వారిని వెంటనే ప్రస్తుత ప్రదేశాల నుంచి ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు రిలీవ్ చేయాలని ఆదేశించారు. పదోన్నతి పొందిన వారంతా తమకు కేటాయించిన పాఠశాలల్లో గ్రేడ్–2 హెచ్‌ఎంగా విధుల్లో చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

క్లుప్తంగా

డిజిటల్ బోధనతో అభ్యసనంపై ఆసక్తి



డిజిటల్ బోధనలో కొత్త మెలకువలు నేర్చుకుంటున్న ఉపాధ్యాయులు

రాజాం: ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విద్యా బోధన ద్వారా విద్యార్థుల్లో అభ్యసనంపై ఆసక్తి పెంచవచ్చని ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్లానల్ కోర్సు డైరెక్టర్ ఆర్.మురళీకృష్ణ అన్నారు. బుధవారం స్థానిక జీఎంఆర్ ఐటీలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు అందిస్తున్న డిజిటల్ బోధనకు సంబంధించిన శిక్షణలో పాల్గొన్న ఆయన డిజిటల్ విధానంలో బొమ్మలు వేయడం, బైజ్యూస్ యాప్‌లోని కంటెంట్‌ను బోధించడం, విద్యార్థుల దృష్టిని ఆకర్షించేలా ప్రపంచంలోని అంశాలను డిజిటల్ విధానం ద్వారా ప్లే చేయడం వంటి అంశాలను వివరించారు. ఫెసిలిటేటర్స్ కుమారాపు చంద్రునాయుడు, ప్రసాద్ పలు కొత్త విషయాలను ఉపాధ్యాయులకు వివరించారు. కార్యక్రమంలో ట్రైనర్స్ సతీష్, రవికిశోర్ తదితరులు పాల్గొన్నారు.

ఐహెచ్ఐపీ పోర్టల్‌లో డెంగీ, మలేరియా వివరాలు

విజయనగరం ఫోర్ట్: డెంగీ, మలేరియా వంటి వ్యాధుల వివరాలు ఐహెచ్ఐపీ పోర్టల్‌లో నమోదు చేయాలని డీఎంహెచ్ఓ ఎస్. భాస్కరరావు తెలిపారు. స్థానిక రహమాన్ ఆస్పత్రిని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. లేబరేటరీలో ఎల్-ఫామ్, పీ- ఫామ్‌లను పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వైద్య పరీక్షలు, ఫీజుల వివరాలు తెలిపే బోర్డులు ఆస్పత్రిలో ఏర్పాటు చేయాలని తెలిపారు. ఎపిడిమాలజిస్ట్ డాక్టర్ జి. వెంకటేష్, హెల్త్ ఎడ్యుకేటర్ సత్యరాజ్ పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

నెల్లిమర్ల రూరల్: మండలంలోని బుచ్చన్నపేట గ్రామంలో పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. తమకి వచ్చిన ముందస్తు సమాచారం మేరకు మంగళవారం రాత్రి తనిఖీలు చేపట్టగా బుచ్చన్నపేట గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.6,450 నగదు స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యలు నిమిత్తం కోర్టుకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



పేరాపురంలో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న వ్యవసాయశాఖ ఎ.డి విజయ, తదితరులు

పూసపాటిరేగ: మండలంలోని పలు ఎరువుల దుకాణాలను వ్యవసాయశాఖ ఎ.డి ఎల్.విజయ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ సిబ్బంది, వ్యవసాయ అధికారులు దుకాణాలు తనిఖీ చేసి రికార్డులు, స్టాకు పరిశీలించారు. మండల కేంద్రంతో పాటు పేరాపురంలో తనిఖీలు చేపట్టారు. కార్యక్రమంలో ఏఓ కె. నీలిమ, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

విస్తారంగా వర్షాలు

పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లాలోని వీరఘట్టం, జియ్యమ్మవలస, పాలకొండ, గరుగుబిల్లి, సాలూరు మండలాల్లో బుధవారం సాయంత్రం వర్షం కురిసింది. వీరఘట్టంలో 8.2 మిల్లీమీటర్లు, పాలకొండలో 6.6 మి.మీ., జియ్యమ్మవలస మండలంలో 12.4 మి.మీ., గరుగుబిల్లి మండలంలో 1.4 మి.మీ., సాలూరులో 0.8 మి.మీ వర్షపాతం నమోదైంది. ప్రస్తుతం కురిసిన వర్షం వరి నారుమడులకు, వెద పొలాలకు ఉపయోగకరంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కారణంగా గురువారం వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ విభాగం అధికారులు పేర్కొన్నారు.

గొట్టివలసలో ఏనుగులు ప్రత్యక్షం

గరుగుబిల్లి: మండలంలోని గొట్టివలస ప్రధాన రోడ్డుపై ఏనుగుల గుంపు బుధవారం ప్రత్యక్షమైంది. రోడ్డుపై ప్రయాణించేవారు భయాందోళన చెందారు. మొక్కజొన్న, వరినారుమడులను నాశనం చేస్తుండడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఏనుగుల తరలింపు చర్యలు చేపట్టాలని అటవీశాఖ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

సీతంపేట: స్థానిక ఐటీఐలోని స్కిల్‌హబ్ సెంటర్‌లో నిర్వహిస్తున్న ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి యు.సాయికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫోర్ వీలర్ సర్వీస్ టెక్నీషియన్, సూయింగ్ మెషిన్ ఆపరేటర్ కోర్సులకు ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. ఐదోతరగతి నుంచి పీజీ వరకు చదివిన వారు అర్హులన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు తమ బయోడేటా, రెండు పాస్‌ఫొటోలు, ఆధార్ కార్డు, బ్యాంకు పాసుపుస్తకాల జిరాక్స్‌లతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు సెల్: 79937 95796, 70320 60772 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ప్రేమ.. పెంపకం

మూగ జీవాల పట్ల ప్రస్తుత సమాజంలో చెప్పుకోదగ్గ ప్రేమనే మానవ సమాజం చూపిస్తోంది. ఒకప్పటితో పోల్చితే కొన్ని జీవాల పెంపకం స్టేటస్‌గా కూడా మారింది. అయితే వీటి పెంపకంపై చూపుతున్న శ్రద్ధతో పాటు వీటి నుంచి సంక్రమించే వ్యాధుల పట్ల సరైన అవగాహన కలిగి ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. నేడు ప్రపంచ జునోసిస్ డే సందర్భంగా ప్రత్యేక కథనం

- జంతువుల పెంపకంపై పెరుగుతున్న ఆసక్తి
- అవగాహన తప్పనిసరి అంటున్న వైద్యులు
- నేడు ప్రపంచ జునోసిస్ డే



రాజాంలోని ఓ ఇంట్లో కుందేలు పిల్లలు

రాజాం సిటీ: మానవ జీవన విధానంలో జంతువులు సైతం భాగమయ్యాయి. మనిషి తన అవసరాల కోసం కుక్కలు, పిల్లులు, ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, కుందేళ్లు ఇలా రకరకాల జంతువులను పెంచుకుంటున్నారు. నిన్న మొన్నటి వరకు సరదాకు, ఇంటి కాపలాకు పరిమితమైన కుక్కల పెంపకం ప్రస్తుతం స్టేటస్ సింబల్‌గా మారిపోయింది. అయితే ఎంతో ఇష్టంగా పెంచుకుంటున్న జంతువుల నుంచి మనుషులకు వ్యాధులు సంక్రమించే ప్రమాదం ఉందని వైద్యులు చెబుతున్నారు.

పెరుగుతున్న జంతు ప్రేమ

సమాజంలో జంతు ప్రేమ రోజు రోజుకు పెరిగిపోతుంది. ప్రేమనైతే పంచుతున్నారుగాని వాటితో కలిగే వ్యాధుల గురించి పట్టించుకోవడంలేదు. వైద్య నిపుణుల పరిశోధన ప్రకారం జంతువుల నుంచి మనుషులకు, మనుషుల నుంచి జంతువులకు 190 రకాల వ్యాధులు సోకే అవకాశం ఉంది. ఇలా సోకే వ్యాధులను జునోసిస్ అంటారు. కుక్క కాటు ద్వారా రేబిస్, పందుల ద్వారా మెదడువాపు, పశువులు, గొర్రెల నుంచి టీబీ వ్యాధులు సంక్రమిస్తాయని, వీటన్నింటిలో రేబిస్ వ్యాధి ప్రమాదకరమైనదిగా వైద్యులు పేర్కొంటున్నారు.

జునోసిస్ ఎలా వచ్చిందంటే...

పశువుల నుంచి మనుషులకు వచ్చే వ్యాధుల్లో రేబిస్ అత్యంత ప్రమాదకరమైన, ప్రాణాంతకమైన వ్యాధి. లూయీ పాశ్చర్ అనే శాస్త్రవేత్త పిచ్చికుక్క కాటుకు గురైన వ్యక్తికి 1885 జూలై 6న మొట్టమొదటిసారిగా యాంటీ రేబిస్ టీకాను ఇచ్చారు. ఇది విజయవంతమై అత్యంత ప్రాచుర్యం పొందింది. రేబిస్ టీకాను జూలై 6న కనిపెట్టడం వల్ల ఆ రోజున ప్రపంచ జునోటిక్ దినోత్సవంగా నిర్వహిస్తున్నారు.



ఇటువంటి పిల్లలకు టీకాలు తప్పనిసరి

పిల్లల విషయంలో జాగ్రత్త

పిల్లల విషయంలో తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. కుక్కలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో చిన్నారులు బయట తిరగకుండా చూసుకోవాలి. తమ పెంపుడు కుక్కలు బయట తిరిగే సమయంలో ఇతరులపై దాడి చేయకుండా యజమానులు జాగ్రత్త పడాలి.

వ్యాక్సినేషన్ వేయించాలి

పెంపుడు జంతువులకు వేసే వ్యాక్సినేషన్‌పై చాలా మందికి అవగాహన ఉండదు. కొందరు ఖర్చుతో కూడినదని పట్టించుకోరు. పెట్స్‌కు మామూలుగా కరిచే గుణం ఉంటుంది. కాబట్టి వ్యాక్సినేషన్ తప్పనిసరిగా చేయించాలి. మనిషి, జంతువుకు ఉండే కాంటాక్ట్‌లో అది కరవడం, గీరడం వంటివి సాధారణంగా జరుగుతుంటాయి. దాని వల్ల ఏదైనా ఆరోగ్య సమస్య రావచ్చు. కుక్కలు, పిల్లులు పెంచుతున్న వారు కూడా వ్యాక్సినేషన్ అవసరాన్ని గుర్తించాలి.

వైద్యులు సలహాలు తప్పనిసరి



జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే రోగాలను జునాటిక్ డిసీజస్ అంటారు. ఎబోలా, బర్డ్ ఫ్లూ, రేబిస్, మెదడువాపు వంటివి జునోటిక్ వ్యాధులే. ఈ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఉండాలంటే రెగ్యులర్‌గా వెటర్నరీ వైద్యుల సలహాలు తీసుకోవాలి. ముఖ్యంగా ఇంట్లో కుక్కలు పెంపకం చేపట్టిన వారు చర్మ సమస్యలు వస్తే వెంటనే డాక్టర్‌ని సంప్రదించాలి. సరైన వ్యాక్సిన్ వేయకుండా పెంపుడు జంతువులు, కుక్కలతో సన్నిహితంగా ఉండొద్దు. – డాక్టర్ ఆర్.నీలయ్య, డీడీ, పశుసంవర్ధక శాఖ, బొబ్బిలి

రీసర్వేను పరిశీలించిన తిరుపతి జేసీ

- అద్భుతంగా ఉందని ప్రశంసలు



రామలింగాపురంలో సర్వే పనులను పరిశీలిస్తున్న తిరుపతి జేసీ బాలాజీ తదితరులు

కొత్తవలస : వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ పరిరక్ష పథకంలో చేపట్టిన రీ సర్వే రాష్ట్రంలోనే విజయగనరం జిల్లా ప్రథమ స్థానంలో ఉందని తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ డి.కె.బాలాజీ పేర్కొన్నారు. మండలంలోని రామలింగాపురం గ్రామంలో నిర్వహిస్తున్న రీ సర్వే కార్యక్రమాన్ని ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న రీ సర్వే కార్యక్రమం తిరుపతి జిల్లాలో నేటికీ పూర్తి స్థాయిలో ప్రారంభం కాలేదన్నారు. రాష్ట్రంలోనే విజయనగరం జిల్లాలో రీసర్వే శరవేగంగా సాగుతుందని, ఏ విధంగా నిర్వహిస్తున్నారు.. తదితర అంశాలు పరిశీలించేందుకు వచ్చినట్లు ఆయన తెలిపారు. అనంతరం విజయనగరం జిల్లా సర్వే ఏడీ టి.త్రివిక్రమరావు మాట్లాడుతూ జిల్లాలో మొదటి ఫేజ్‌లో 179 రెవెన్యూ గ్రామాలను ఎంపిక చేసామని ప్రస్తుతం సర్వే పూర్తి చేసి 2,48,448 జగనన్న హద్దురాళ్లను కూడా వేశామన్నారు. అలాగే రెండో ఫేజ్‌లో 319 గ్రామాలను ఎంపిక చేశామన్నారు. ప్రస్తుతం 80 గ్రామాల్లో సర్వే పూర్తయినట్టు తెలిపారు. మిగిలిన గ్రామాలు ఆగస్టు నెలాఖరి నాటికి పూర్తి చేస్తామన్నారు. సర్వే సిబ్బంది అంకిత భావంతో పని చేయడం వలన రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తిరుపతి జిల్లా సర్వే ఏడీ జయరాజు, కేఆర్ఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ, తహసీల్దార్ శ్రీనివాసమిశ్ర, డిప్యూటి తహసీల్దార్ కోట అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కన్నీటి 'సాగరం'..!

- ముగ్గురు భవన నిర్మాణ కార్మికుల మృతితో విషాదంలో కుటుంబ సభ్యులు
- మృతదేహాలకు అంతిమ సంస్కారాలకు ఏర్పాట్లు



మేనత్త గంగమ్మ వద్ద పెరుగుతున్న జగన్నాథం కుమారుడు లక్ష్మణ, కుమార్తె రాము



తండ్రిని కోల్పోయి నాన్నమ్మ సుభద్రమ్మ చెంత చేరిన మనుమలు గణేష్, మణికంఠ

కన్నీటి రోదన



చిత్రంలో విలపిస్తున్న వృద్ధుడిపేరు రాపాక నగిరేసు. ప్రహరీ కూలిన ప్రమాదంలో తమ్ముడు రాపాక కన్నయ, అల్లుడు నక్కేల సత్యం మృతితో కన్నీటిపర్యంతమవుతున్నాడు. ప్రమాదంలో తమ్ముడు, అల్లుడు మృతిచెందడంతో విషాదంలో మునిగిపోయాడు.

బాడంగి: చెన్నైలోని కోయంబత్తూరు సమీపంలోని కృష్టాకళాశాల ప్రహరీ పునర్నిర్మాణ పనుల్లో నిమగ్నమైన కూలీలపై మంగళవారం సాయంత్రం ప్రహరీ కూలిపోవడంతో నలుగురు మృతిచెందిన విషయం పాఠకులకు తెలిసిందే. వీరిలో ముగ్గురు బాడంగి మండలం వీరసాగరానికి చెందిన వారుకాగా, ఒకరు ఉత్తరాదికి చెందిన వారు. మృతుల కుటుంబాలు సుమారు 15 ఏళ్లుగా వలస జీవనంపైనే ఆధారపడి జీవిస్తున్నాయి. చెన్నైలో భవన నిర్మాణ కార్మికులుగా పనిచేస్తూ పండగలకు, శుభకార్యాలకు స్వగ్రామానికి వచ్చి వెళ్తున్నారు. నెలరోజుల కిందటే గ్రామానికి వచ్చి మళ్లీ చెన్నైవెళ్లినట్టు గ్రామస్తులు చెబుతున్నారు. కొల్లి జగన్నాథం, నక్కేల సత్యం, రాపాక కన్నయ్య మృతితో వారి కుటుంబాలు కన్నీటిపర్యంతమవుతున్నాయి. ముగ్గురు మృతదేహాలు గురువారం నాటికి విమానంలో విశాఖపట్నం విమానాశ్రయానికి, అక్కడి నుంచి గ్రామానికి చేరుతాయని గ్రామస్తులు చెబుతున్నారు. అంతిమ సంస్కారాలకు ఏర్పాట్లు చేస్తున్నారు.

- మృతుడు కొల్లిజగన్నాథం కుమారుడు లక్షణ రాజమండ్రిలో ఎమ్మెస్సీ చదువుతుండగా, వివాహమైన రాముఅనే కుమార్తె ఉన్నారు.
- నక్కేల సత్యానికి తల్లి సుభద్రమ్మతో పాటు ఇంటర్మీడియట్, 9వ తరగతి చదువుతున్న గణేష్,మణికంఠ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు.
- మృతుడు రాపాక కన్నయ్యకు సూర్యారావు, వెంకన్న, సత్యవతి అనే ముగ్గురు పిల్లలున్నారు. వీరు తమ తండ్రులు మృత్యు వాతపడ్డారని తెలుసుకొని విలపిస్తున్నారు.

బీఆర్‌వో రిక్రూట్‌మెంట్‌లో యువకుడి మృతి

రామభద్రపురం: మహారాష్ట్రలోని పూణేలో జరుగుతున్న బీఆర్‌వో రిక్రూట్‌మెంట్‌లో రామభద్రపురం గ్రామానికి చెందిన యువకుడు బుధవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. మండల కేంద్రంలోని చొక్కాపు వీధికి చెందిన చొక్కాపు మురళీకృష్ణ(29)కు బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్‌లో స్టోర్ కీపర్ టెక్నికల్ పోస్టు కోసం కాల్ లెటర్ వచ్చింది. దీంతో అతడు రెండు రోజుల క్రితం మహారాష్ట్రలోని పూణేకు వెళ్లాడు. అక్కడ కొన్ని ఈవెంట్‌లైన తర్వాత బుధవారం 1600 మీటర్ల పరుగు పందెం ఈవెంట్‌లో పాల్గొని పరిగెడుతుండగా మధ్యలో సొమ్మసిల్లి పడిపోయాడు. వెంటనే అక్కడి అధికారులు వైద్యాధికారికి సమాచారం ఇవ్వగా వైద్యాధికారి వచ్చి పరీక్షించారు. అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతి చెందాడన్న వార్త తెలియడంతో గ్రామమంతా విషాదఛాయలు అలుముకున్నాయి. పోస్టుమార్టం నిమిత్తం అక్కడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఉద్యోగం సాధించి వస్తానని చెప్పి వెళ్లిన కుమారుడు మృతి చెంది, తిరిగిరాని లోకాలకు వెళ్లి పోయాడని తెలుసుకున్న తల్లి జయమ్మ గుండెలవిసేలా రోదిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది. గత కొన్నేళ్ల క్రితం తండ్రి మృతి చెంది, ఇప్పుడు అందివచ్చిన కొడుకు చనిపోవడంతో పెద్దదిక్కు కోల్పోయామని తల్లి, ఇద్దరు అక్కలు బోరున విలపిస్తున్నారు.



మురళీకృష్ణ మృతదేహం

నేడు ఉచితంగా ర్యాబిస్ టీకాలు

పార్వతీపురంటౌన్: ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా పెంపుడు కుక్కలు, పిల్లులకు పార్వతీపురం మన్యం జిల్లాలోని అన్ని పశువైద్యశాలల్లో ఉచితంగా ర్యాబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేస్తామని జిల్లా పశుసంవర్థక శాఖాధికారి బి.శ్రీనివాసరావు తెలిపారు. పార్వతీపురం వెటర్నరీ ఆస్పత్రి వద్ద ఆయన విలేకరులతో బుధవారం మాట్లాడారు. జిల్లాలోని 38 వెటర్నరీ డిస్పెన్సరీలు, ఏడు పశువైద్యశాలల్లో టీకా పంపిణీ నిర్వహిస్తామన్నారు. జూనోటిక్ వ్యాధులపై అవగాహన కల్పిస్తామన్నారు.

రక్తదానం

విజయనగరం గంటస్తంభం: ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ సంస్థ 45వ వార్షికోత్సవం సందర్భంగా సంస్థ కార్యాలయంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ వి.శ్రీనివాసరావు ప్రారంభించిన శిబిరంలో 29 మంది ఉద్యోగులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహనిర్మాణ సంస్థ లక్షలాది మంది పేదల సొంత ఇంటికలను నేరవేర్చిందన్నారు. రక్తదానలు అభినందించారు. వార్షికోత్సవం సందర్భంగా క్రికెట్, రంగోళి, లెమన్ అండ్ స్పూన్ తదితర పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

నేడు కౌన్సెలింగ్

విజయనగరం ఫూల్‌బాగ్: జిల్లా పరిషత్ యాజమాన్యంలో ఖాళీగా ఉన్న స్కూల్ అసిస్టెంట్(ఆంగ్లం) పోస్టును పదోన్నతిపై భర్తీ చేసేందుకు గురువారం ఉదయం 9.30 గంటలకు డీఈఓ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామని డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి తెలిపారు. సీనియారిటీ జాబితాలోని ఎస్‌జీటీలు వారి సర్వీస్ రిజిస్టర్, సర్టిఫికెట్స్‌తో హాజరు కావాలని కోరారు.

భవనాలను అప్పగించండి

పార్వతీపురం: నిర్మాణాలు పూర్తయిన భవనాల ను సంబంధిత శాఖలకు అప్పగించాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రాధాన్యత భవన నిర్మాణాల పురోగతిపై మండలాలవారీగా బుధవారం సమీక్షించారు. నిర్మాణాలు పూర్తయిన సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్ల భవనాల ను సంబంధిత శాఖ అధికారులకు వెంటనే అప్పగించాలన్నారు. చివరి దశలో నిర్మాణంలో ఉన్నవి ఈ నెల 12నాటికి పూర్తిచేయాలన్నారు. భవన నిర్మాణాలకు నిధుల సమస్యలేదని, పూర్తయిన వెంటనే బిల్లులు చెల్లిస్తున్నట్టు వెల్లడించారు. నిర్మాణాల ప్రగతిపై నివేదిక అందజేయాలని పీఆర్ ఇంజినీరింగ్ అధికారి ఎంవీఆర్ కృష్ణాజీని ఆదేశించారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

ఆశ్రమ వసతి గృహాలకు.. బ్రాండెడ్ సరుకులు



జీసీసీ సరఫరా చేస్తున్న సన్‌ఫ్లవర్ ఆయిల్



అకోలా కందిపప్పు

- పామాయిల్ స్థానంలో సన్‌ఫ్లవర్ ఆయిల్
- అకోలా కందిపప్పు
- నాణ్యమైన బన్సీరవ్వ, ఇడ్లీనూక, మినపగుళ్ల సరఫరా
- 20వేల మంది గిరిజన విద్యార్థులకు ప్రయోజనం



భోజనాలు చేస్తున్న సీతంపేట బాలుర ఆశ్రమపాఠశాల విద్యార్థులు

సీతంపేట:

విద్యార్థులకు ప్రమాణాలతో కూడిన విద్యాబోధనతో పాటు రుచికరమైన భోజనం వడ్డించాలని జగన్మోహన్‌రెడ్డి సర్కారు ఆదేశాలు జారీచేసింది. ఆ మేరకు మెనూ రేట్లను పెంచింది. ప్రభుత్వ పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద కింద పౌష్టికాహారం వడ్డిస్తోంది. అదే కోవలో గిరిజన సంక్షేమ ఆశ్రమ వసతి గృహాలు, గురుకులాలు, పోస్టుమెట్రిక్ వసతిగృహాల్లో చదువుతున్న విద్యార్థులకు సైతం నాణ్యమైన భోజనం వడ్డించేలా చర్యలు చేపట్టింది. ఈ మేరకు జీసీసీ ఆధ్వర్యంలో బ్రాండెడ్ సరుకులు సరఫరా చేయాలని సీతంపేట ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి జీసీసీ అధికారులను ఆదేశించారు. పామాయిల్ స్థానంలో సన్‌ఫ్లవర్, అకోలా కంపెనీకి చెందిన కందిపప్పు, ట్రిబుల్ హార్స్ మినపగుళ్లు, బన్సీరవ్వ, ఇడ్లీనూక, గోధుమ పిండి వంటివి జీసీసీ సరఫరా చేస్తోంది.

సీతంపేట ఐటీడీఏ పరిధిలో 47 ఆశ్రమపాఠశాలలు, 8 గురుకులాలు, మరో 12 పోస్టు మెట్రిక్ వసతి గృహాలున్నాయి. వీటిలో సుమారు 20 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. వసతిగృహాల్లో ఉండి చదువుకోవాలి కాబట్టి ప్రతీ రోజు అందించే మెనూ నాణ్యమైనదిగా ఉండాలని ప్రభుత్వం ఆదేశించింది.

సరుకుల సరఫరా ఇలా..

ప్రతినెల ఆయా వసతి గృహాలకు సరిపడా సరుకులను జీసీసీ సరఫరా చేస్తోంది. నెలకు సన్‌ఫ్లవర్ ఆయిల్ 19 వేల లీటర్లు, వేరుశనగ 60 క్వింటాలు, గోధుమ పిండి 160 క్వింటాలు, కందిపప్పు 220 క్వింటాలు, మినుములు 70 క్వింటాలు, బఠానీ 220 క్వింటాలు, ఇడ్లీరవ్వ 140 క్వింటాలు, బెల్లం 52 క్వింటాలు, పంచదార 24 క్వింటాలు, పెసర పప్పు 87 క్వింటాలు సప్లై చేస్తోంది. వీటితో పాటు విశాఖ డైయిరీ పాలప్యాకెట్లు, బ్రాండెడ్ జీసీసీ కారం, పసుపు పౌడర్, ఎండు మిర్చి, వీడీవీకేల నుంచి జీడి పప్పు సమకూర్చుతోంది.



లోడ్ దింపుతున్న పాలప్యాకెట్లు

నాణ్యమైన సరుకుల సరఫరా



అధికారుల ఆదేశాల మేరకు ఐటీడీఏ పరిధిలోని అన్ని వసతి గృహాలకు బ్రాండెడ్ సరుకులు పంపిణీ చేస్తున్నాం. సరఫరాలో ఎటువంటి సమస్యలు వచ్చినా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తాం.

– జి.సంధ్యారాణి, జీసీసీ డీఎం

మెనూ బాగుంది



మెనూ గతంతో పోలిస్తే చాలా బాగుంది. మాకు పోషకాహారంతో కూడిన మెనూ అందిస్తున్నారు. ఇది వరకటి కంటే రుచికరమైన భోజనం అందుతోంది. అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు.

– సవర సురేఖ, గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల, సీతంపేట

ఆశ్రమ పాఠశాలలు, గురుకుల వసతిగృహాల్లో కొత్తమెనూ ఇది....

వారం	అల్పాహారం	మధ్యాహ్నం	సాయంత్రం స్నాక్స్	రాత్రి
ఆదివారం	పూరి, బంగాళా దుంప, ఆనీకుర్మ, ఉడకబెట్టిన కోడిగుడ్డు	చికెన్ బిర్యాని, పెరుగుపచ్చడి, గోంగూర చట్నీ	సేమ్యా పాయసం, అరటిపండు	అన్నం, సాంబార్, క్యారెట్ పెసరపప్పు కూర, బట్టర్‌మిల్క్
సోమవారం	పులిహోరా, రోస్టెడ్ బెంగాల్ గ్రామ్ డాల్ పౌడర్, ఉడకబెట్టిన కోడిగుడ్డు	అన్నం గోంగూర పప్పు, కాయగూర, పెరుగు	ఉడకబెట్టిన గుగ్గిళ్లు, జామ/స్థానికంగా లభించే పండు	అన్నం, క్యాబేజీ కూర, రసం, మజ్జిగ
మంగళవారం	ఇడ్లీ, వేరుశనగ చట్నీ, ఉడకబెట్టిన కోడిగుడ్డు	అన్నం, పాలకూరపప్పు, కాయగూర, పెరుగు	రాగిలడ్డు, అరటిపండు	బగార రైస్, చికెన్ కర్రి, గోంగూర చట్నీ, పెరుగుపచ్చడి
బుధవారం	జీరా రైస్, కాయగూర, ఉడికించిన కోడిగుడ్డు	అన్నం, వంకాయకూర, మెంతి కూరపప్పు, పెరుగు	ఉడకబెట్టిన బొబ్బర్లు, జామ/ లోకల్ ఫ్రూట్	అన్నం, బెండకాయ, సాంబారు, మజ్జిగ
గురువారం	బాస్మతీరవ్వ ఉప్మా, వేరుశనగచట్నీ, ఉడకబెట్టిన కోడిగుడ్డు	అన్నం, పాలకూర పప్పు, కాయగూర, పెరుగు	మరమరాల మిక్చర్, అరటిపండు	అన్నం, చిక్కుడు కాయ వేపుడు, సాంబార్, మజ్జిగ
శుక్రవారం	హాట్‌పంగల్, డాల్ పప్పు చట్నీ, ఉడకబెట్టిన కోడిగుడ్డు	అన్నం, మెంతి కూరపప్పు, బంగాళదుంప, పెరుగు	ఉడకబెట్టిన శనగలు, జామ/ లోకల్‌ఫ్రూట్	అన్నం, గుత్తివంకాయ కూర, మజ్జిగ
శనివారం	ఇడ్లీ, వెరుశెనగ చట్నీ	అన్నం, పాలకూరపప్పు, క్యాబేజీ కూర, పెరుగు	రవ్వ కేసరి, అరటి పండు	అన్నం, దొండకాయ కూర, సాంబార్, బట్టర్‌మిల్క్

ఆదివారం మినహా మిగిలిన రోజుల్లో ఉదయం పాలు, ఉదయం విశ్రాంతి సమయంలో స్నాక్స్ కింద మల్టీమిల్లెట్ చక్కీలు ఇవ్వాలి.